సంక్షేమం.. దుర్భరం

- నమస్యల లోగిళ్లలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు
- పెచ్చులూడిన గదుల్లో విద్యార్థుల అవస్థలు
- కిటికీలు, డోర్లు లేక చలికి గజగజ
- నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా బాత్‌రూమ్‌లు

సాక్షి విజిట్

కోడుమూరు రూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో చిన్న చిన్న రిపేర్లు సైతం చేయించుకునేందుకు వార్డెన్ల వద్ద డబ్బుల్లేని పరిస్థితి. హాస్టల్ గదులకు కిటికీలు, వాకిళ్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు దోమలు, చలిగాలులతో ఇబ్బంది పడుతూ రోగాల భారిన పడుతున్నారు. చాలా హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు సరిగా లేక, నీళ్లు రాకపోవడంతో అత్యవసరాలకు కూడా బయటకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మరికొన్ని హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికీ వాటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

బాలికల అగచాట్లు

కోడుమూరులోని బీసీ బాలికలు, ఎస్సీ బాలికల హాస్టల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. బోర్లు లేకపోవడంతో రెండు హాస్టళ్ల విద్యార్థులు పూర్తిగా గ్రామ పంచా యతీ సరఫరా చేసే కొళాయిల నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నీరు వందలాది మంది విద్యార్థినులకు ఏ మూలకు సరిపోకపోవడంతో చాలామంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండలేక టీసీలు తీసుకుని వేరే ఊర్లకు వెళ్లిపోయారు. బాత్‌రూమ్‌ల సమస్య కూడా తీవ్రంగా ఉంది. కోడుమూరులోని బాలికల ఎస్సీ, బీసీ, కళాశాల హాస్టళ్లలో ఎక్కడా సీసీ కెమెరాలు లేవు.

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న లద్దగిరి బీసీ హాస్టల్

కోడుమూరు మండలం లద్దగిరి బీసీ హాస్టల్–1, 2 భవనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. హాస్టల్ భవనం 50 సంవత్సరాల క్రితం నిర్మించింది కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి అప్పుడో ఇప్పుడో కూలే విధంగా ఉండడంతో అధికారులు తాత్కాలికంగా స్థానిక హైస్కూల్లో వసతిని ఏర్పాటు చేశారు.

లద్దగిరి బీసీ హాస్టల్లో వసతుల్లేక విద్యార్థుల అవస్థలు

లద్దగిరి బీసీ బీసీ వెల్ఫేర్ వసతి గృహం–1లో 210 మంది విద్యార్థులుండగా, వసతి గృహం–2లో 212 మంది విద్యార్థులుంటున్నారు. వరుసగా నిలబడితే 150 మందికి కూడా సరిపోని గదిలో రాత్రిపూట 120 మంది నిద్రపోవాల్సిన పరిస్థితి. 422 మంది విద్యార్థులకు సరిపడే బాత్‌రూమ్‌లు లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. వంట వండే రేకుల కిచెన్ షెడ్ పూర్తిగా దెబ్బతినడంతో వార్డెనే సొంత ఖర్చుతో రిపేరీ చేయించాడు.

- కోడుమూరు మండలంలోని గోరంట్ల గురుకుల పాఠశాల, అమడగుంట్ల బీసీ హాస్టళ్లకు కాంపౌండ్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లు ఉన్నాయి. అయితే ఎస్సీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడే మంచినీటి వసతి, కాంపౌండ్ వాల్, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. గురుకుల పాఠశాలలో గతంలో విద్యార్థులు పాముకాటుకు గురైన సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా రెండు హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యలేదు. గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం ఏర్పాటు 16 సీసీ కెమెరాలు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూన్ నెల నుంచి పనిచేయడం లేదు. ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లలో విద్యార్థులు ఉండేదుకు సరిపడా గదులు, గురుకులంలో తరగతి గదులు లేవు.

అరకొరగా సిబ్బంది

సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులకు వంట వండేందుకు కావాల్సిన వంట మనుషులు పూర్తిగా లేరు. దీంతో వార్డెన్లు ఉన్న వాళ్లతోనే భోజనం తయారుచేయిస్తూ బండిని లాగిస్తున్నారు. కొన్ని హాస్టళ్లలో స్వీపర్లు లేక వంట మనుషులతోనే హాస్టళ్లలను శుభ్రం చేయించాల్సిన పరిస్థితి దాపురించింది. అలాగే ఒకే వార్డెన్‌కు రెండు, మూడు హాస్టళ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పుతుండడంతో వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లులు రాక వార్డెన్ల ఇక్కట్లు

2024 జూలై నుంచి బీసీ, ఎస్సీ సాంఘిక హాస్టళ్లకు సంబంధించి మెస్ చార్జీలు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేసి పిల్లలకు వండిపెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మంజూరుకాని గౌరవ వేతనం

హాస్టళ్లలో విద్యార్థులకు పాఠాలు, ప్రైవేట్ క్లాసులు చెప్పే ట్యూటర్లకు గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంతో చాలా హాస్టళ్లలో ట్యూటర్లు మానుకుంటుండగా, మరికొందరూ ఇబ్బందులు పడుతూ అలాగే ప్రైవేట్ క్లాసులు చెబుతున్నారు.



కోడుమూరు ఎస్సీ హాస్టల్లో నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్‌లు



కోడుమూరు ఎస్సీ హాస్టల్లో కిటికీలకు మెష్ లేని దృశ్యం



సి.బెళగల్ గురుకుల పాఠశాలలో పనిచేయని సీసీ కెమెరాల మానిటర్

సమస్యల ఒడిలో సంక్షేమ గృహాలు

- అడుగడుగునా సమస్యల చిట్టా
- ఐదు నెలలుగా డైట్ బిల్లులు చెల్లించని ప్రభుత్వం

గడివేముల/పాణ్యం: బాలలకు వసతి కల్పించాల్సిన బీసీ సంక్షేమ హాస్టళ్లు అవస్థలమయంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో కనీస నిర్వహణకు దూరమయ్యాయి. అధ్వాన మరుగుదొడ్లు, కానరాని కిటికీలు, దోమలతో అవస్థలు, అందని రక్షిత జలాలు... ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి.

తలుపులులేని మరుగుదొడ్లు

మండల కేంద్రమైన గడివేముల బీసీ వసతి గృహంలో కనీస సౌకర్యాలులేవు. మరుగుదొడ్లకు తలుపులు లేక, వాటి శుభ్రం పట్టించుకోక దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆరు బయటే సామూహిక స్నానాలు చేస్తున్నారు. కిటకీలకు తలుపులు, దోమ తెరలు లేక దోమ కాటుకు గురవుతున్నారు. ఈ ఏడాది ఆరు నుంచి పదో తరగతి చెందిన 131 మంది విద్యార్థులు చదువుతున్నట్లు హాస్టల్ సంక్షేమ అధికారి వెంకటపతి తెలిపారు. జూన్ నుంచి ఇంతవరకు డైట్ బిల్లులు విడుదల కాలేదని, పాలు, కూరగాయాలు, గుడ్లు, చికెన్, వంటనూనె తదితర వస్తుల కొనుగోలుకు ప్రతి నెల రూ.70 వేల దాకా ఖర్చు అవుతుందని, తామే అప్పుచేసి హాస్టల్‌ను నడిపే పరిస్థితి ఉందని వార్డెన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏప్రిల్ వరకు బిల్లులు చెల్లించిందని తెలిపారు.

బీసీ హాస్టల్‌లో సమస్యలు

మండల కేంద్రమైన గడివేముల బీసీ హాస్టల్ నందు 131 విద్యార్థులు ఉన్నారు.

- డోర్లకు మెస్ లేకపోవడంతో కిటికీల నుంచి దోమలు వస్తున్నాయి.
- ఆరు రూములు ఉన్నాయి, అందులో కొన్ని ఫ్యాన్లు పనిచేయడం లేదు.
- బాత్రూం డోర్లు కుళ్లిపోయాయి విద్యార్థులు స్నానాలు చేయడానికి ఇబ్బందిగా ఉంది.
- లెట్రిన్లలో కుళాయిలు పనిచేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి,
- హాస్టల్ ఆవరణలో అక్కడక్కడ బండపరుపు దెబ్బతినడంతో విషపు పురుగులు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.
- విద్యార్థులకు ఇప్పటి వరకు ప్లేట్లు, గ్లాసులు, పెట్టెలు పంపిణీ చేయలేదు.
- విద్యార్థులకు హాస్టల్‌లోని బోరుకు తాగడానికి పనికి రాకుండా ఉప్పుగా ఉన్నయని బయటి నుంచి ప్రతి రోజు 5 మినరల్ వాట్ క్యాన్లను తీసుకొచ్చి విద్యార్థులు తాగునీరు సమస్య తీరుస్తున్నారు.
- మెనూను సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

పాణ్యం మండలం..

మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కొన్ని రోజులుగా సురక్షిత మంచినీరు అందడం లేదు. అక్కడ ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు చెడిపోయింది. అలాగే వసతిగృహానికి కాంపౌండ్ వాల్ లేదు. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు.

ఓర్వకల్లు మండలం..

- మండలంలోని కాల్వబుగ్గ ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 430 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులే ఒకరి కొకరు ఆహారాన్ని వడ్డించుచుకోవాల్సి ఉంటుంది.
- ఓర్వకల్లులోకి ఎస్సీ బాలికల వసతి గృహంలో 310 మంది ఉంటున్నారు. వీరికి సరిపడా వసతి గదులు లేక అవస్థలు పడుతున్నారు.
- బాలుర వసతి గృహంలో బాలుర తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ హాస్టల్‌కు ప్రహరీ లేక విద్యార్థులు భయపడుతున్నారు. మరుగుదొడ్లకు నీటి వసతి లేక నిరుపయోగంగా వదిలేశారు.
- లొద్దిపల్లె బీసీ బాలుర వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉంటున్నారు. భవనం పాతది కావడంతో పూర్తి అసౌకర్యంగా మారింది. వసతి గృహంలో పై పెచ్చులూడిపోయి కాంక్రీట్ కడ్డీలు బయటపడ్డాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.
- మిదివేములలో బీసీ బాలుర వసతి గృహంలో 300మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒక్కో గదిలో 20–30మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టల్‌కు ప్రహరీ లేక విషసర్పాలు లోపలికి వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

కల్లూరు మండలం

కల్లూరు మండలం పర్ల గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం ఉంది. ఈ హాస్టల్ నందు 50 మంది విద్యార్థులు ఉన్నారు. పాత భవనం కావడంతో పై నుంచి పెచ్చులూడుతున్నాయి.

- ఉలిందకొండ ఎస్సీ బాలుర హాస్టల్ నందు 245 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు సరిగ్గాలేదు.
- పెద్దపాడు ఎస్సీ బాలుర బాలుర గృహంలో 246 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు.
- పెద్దపాడు బీసీ బాలుర వసతిగృహంలో 250 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సరిపడా మరుగుదొడ్లు లేవు.



దెబ్బతిన్న గడివేముల బీసీ హాస్టల్ మెట్లు



గడివేముల బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లకు తలుపులు విరిగిన దృశ్యం



పాణ్యం ఎస్సీ హాస్టల్‌లో నిరుపయోగంగా మినరల్‌వాటర్ ప్లాంట్



గడివేముల బీసీ హాస్టల్‌లో చికెన్‌కి బదులుగా వడ్డించిన గుడ్డు, ఉర్లగడ్డ కూర



లొద్దిపల్లె బీసీ వసతి గృహంలో పెచ్చులూడిన పైకప్పు

క్లుప్తంగా

శ్రీశైలానికి 38వ సారి పాదయాత్ర



గని నుంచి శ్రీశైలానికి బయలుదేరిన భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామం నుంచి ప్రతి ఏడాది కార్తీకమాసంలో శ్రీశైలానికి పాదయాత్ర చేసి శివుడుని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం గ్రామం నుంచి 38వ సారి దాదాపు 40 మంది దాకా పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్రలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా పాదయాత్ర కమిటీని నియమించి భోజన, వసతి ఏర్పాట్లు చేసుకుంటారు. పాదయాత్రగా వెళ్తున్న భక్తులను గ్రామస్తులు ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రతాపరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివప్ప, శరభయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

గడివేముల: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే భవిష్యత్‌లో మంచి స్థాయిలో ఉంటారని గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక మోడల్, జెడ్పీ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ శైలజ, హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శాఖా గ్రంథాలయాధికారిని కౌసల్య ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు రోజున ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని కౌసల్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రాణేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కేఆర్‌ఆర్, మోడల్ స్కూల్, ఆశ్రమ, జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ ముక్తార్ బాషా

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల అసిస్టెంట్ ఇంజినీర్ ముక్తార్ బాషా సోమవారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పడిదెంపాడు గ్రామంలో రూ.18 లక్షలతో ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గడువులోగా పనులను పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అమీర్ ఉన్నారు.

శాంతిరాంలో గ్రీన్ ఎక్స్‌పో

పాణ్యం : మండల పరిధిలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో 63వ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రీన్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ఆశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి మనకు ఎన్నో రకాల ఔషధ వనరులు అందించిందన్నారు. వాటి విలువలను ప్రజలకు విద్యార్థులు తెలియజేయాలన్నారు. అనంతరం గ్రీన్ ఎక్స్‌పో సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కల్లూరు: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలని పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్న సంతోష్‌కుమార్, నవీన్, శివశంకర్, మనోజ్, ప్రణయ్, సంతోష్, మహేష్‌లను ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం రావాలి

ఓర్వకల్లు : ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం రావాలని ప్రకృతి వ్యవసాయ మండల బృందం నాయకులు వంశీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమం సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను ప్రదర్శించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరుచేసి ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం కోడుమూరు, గూడూరు మండలాల్లోని గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ నాయకులు ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు పెద్ద ఎత్తున అర్జీలను ఆయా గ్రామ సచివాలయాల్లో సమర్పించారు. కృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలాలున్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా అధ్యక్షుడు శేషుకుమార్, సీపీఐ మండల కార్యదర్శులు రాజు, శ్రీనివాసులు, జిల్లా సమితి అధ్యక్షురాలు సులోచనమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు రాకపోతే చర్యలు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి హాజరుకాని మండల అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి ఇద్దరు అధికారులు (విద్యుత్ ఏఈ సుకుమార్, ఏఓ మల్లేష్‌కుమార్) మాత్రమే హాజరుకాగా, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి తహసీల్దార్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్‌కు హాజరై తర్వాత వెళ్లిపోయారు. కొందరు అధికారుల తరచూ డుమ్మా కొట్టడం, మరికొందరు ఇలా వచ్చి అలా వెళ్లడం గమనించిన తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇకపై ప్రతి సోమవారం మండల అధికారులందరూ తప్పనిసరిగా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు హాజరవ్వాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సి.బెళగల్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

పొదుపు మహిళల అభ్యున్నతికి కృషి

సి.బెళగల్: వీఓఏలు పొదుపు మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని డీఆర్‌డీఏ – వెలుగు మండల ఏపీఎం రామేశ్వర్ సూచించారు. ఆయన సోమవారం వెలుగు సీసీలు, సిబ్బంది, మండలంలోని వీఓఏలు, పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంకు ద్వారా పొందిన రుణాలతో వారి కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మహిళలు వివిధ పథకాలలో భాగంగా బ్యాంకులలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని, రుణాలను చెల్లించిన పొదుపు గ్రూపు సభ్యులకు రుణాలను వెంటనే రీ షెడ్యూల్ అయ్యేలా సీసీలు చొరవ చూపాలని ఏపీఎం అన్నారు. సమావేశంలో సీసీలు రాముడు, గుండమయ్య, శ్రీనివాసులు, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాక్సింగ్ పోటీలకు వెళుతున్న సందర్భంగా గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు వారికి సోమవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఆయన పర్ల గ్రామంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్రజున్నిసా బేగం మాట్లాడూతూ.. తమ పాఠశాల నుంచి ఐదుగురు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు విజయభాస్కర్ యాదవ్, షిరిజ్ ఉన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. పంచాలింగాల గ్రామంలో 19, 20 తేదీల్లో, ఈ.తాండ్రపాడు, తొలశాపురం, బసవపురం గ్రామాలలో 21, 22 తేదీల్లో, నిడ్జూరు, రేమట నందనపల్లె, గార్గేయపురం గ్రామాల్లో 21, 22 తేదీల్లో గ్రామ సచివాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ సేవలందిస్తారని తెలిపారు.

రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేయాలి

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం వద్ద రైతుల సమస్యలపై నిరసన చేపట్టారు. అనంతరం సమస్యలపై రైతు సేవా కేంద్రం అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు, కౌలురైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుజ్జన్న, జగన్నాథం, ఆకుల మధు, దానమయ్య, గోపాల్, దేవరాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

భోగేశ్వరంలో కార్తీక సందడి



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీకమాసం, మూడవ సోమవారం కావడంతో వందలాది మంది భక్తులు భోగేశ్వరానికి తరలివచ్చారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ రామానుజన్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులకు కాశీరెడ్డి నాయన ఆశ్రమం, ఆర్యవైశ్యసంఘం, వీరశైవుల ఆధ్వర్యంలో అన్నదాన సౌకర్యం కల్పించారు. అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఏడూర్ల గవిలో వెలసిన శివలింగాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుగ్గరామేశ్వరస్వామికి అభిషేకాలు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో సామవారం భక్తుల సందడి నెలకొంది. స్వాముల వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు కళ్లె.లక్ష్మీనారాయణ శర్మ, నరసింహాశర్మలు స్వామి, అమ్మవార్లకు అభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం కర్నూలు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి వెంకటరామిరెడ్డి సతీసమేతంగా స్వాముల వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

సి.బెళగల్: కార్తీక మాసం సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి దేవాలయం, ఈశ్వర దేవాలయం, పార్వతి అమ్మవారి ఆలయం, పోలకల్‌లోని చెన్న సోమేశ్వర స్వామి దేవాలయం, కంబదహాల్, ముడుమాల, కె.సింగవరం, కొత్తకోట తదితర గ్రామాలలోని శివాలయాలలో భక్తులు పెద్ద ఎత్తున దూప, దీప నైవేద్యాలను సమర్పించి అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చాంపియన్‌గా చిన్నటేకూరు గురుకుల కళాశాల



విద్యార్థులతో ప్రిన్సిపాల్ మహానంది, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు

కల్లూరు : వైఎస్సార్ కడప జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల గండిక్షేత్రంలో ఈ నెల 14 నుంచి 17వ వరకు ఉమ్మడి నాలుగు జిల్లాలకు చెందిన అంతర్ పాఠశాలల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చిన్నటేకూరు గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ఖోఖోలో విజయం సాధించగా, కబడ్డి, వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. అథ్లెటిక్ విభాగంలో షాట్‌పుట్‌లో మొదటి స్థానం, జావలిన్‌త్రోలో మూడోస్థానం, లాంగ్‌జంప్‌లో రెండో స్థానం, డిస్కస్‌త్రోలో మూడవ స్థానం సాధించారు. ఉమ్మడి రాయలసీమకు చెందిన నాలుగు జిల్లాలకు చెందిన గురుకుల కళాశాల, పాఠశాలల పోటీలో అన్ని క్రీడాల్లో ప్రతిభ కనపర్చిన చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఓవరాల్స్ గేమ్స్ చాంపీయన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. దీంతో సోమవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ మహానంది, ఐఐటీ, నీట్ అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు.. ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్‌కుమార్‌లను, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో 71వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఉల్చాల సహకార పరపతి సంఘం ఇన్‌చార్జ్ విజయభారతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా డివిజన్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ షేక్ జఫ్రీన్ మాట్లాడుతూ.. సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సబ్ డివిజనల్ అధికారి నాగరామయ్య, రామకృష్ణ, మున్వర్ బాషా, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.